సాక్షి సూర్యాపేట

సోమవారం, 15 జనవరి, 2024



వందరోజుల్లో అమలు

దరఖాస్తులు పరిశీలించి వంద రోజుల్లో అన్ని పథకాలు అమలు చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. - 8లో



దోపిడీ కేసులో దంపతుల అరెస్ట్

మహిళపై దాడి చేసి ఆమె మెడలోని బంగారు ఆభరణాలను దోపిడీ చేసిన దంపతులను పోలీసులు అరెస్ట్ చేశారు. - 10లో



ప్రత్యేకంగా భోగి వేడుకలు

చౌటుప్పల్ మండలం అంకిరెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం భోగి వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించారు. - 10లో

న్యూస్‌రీల్

మంత్రి కోమటిరెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు



నల్లగొండ: రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమైన సంక్రాంతి పండుగను తెలుగు ప్రజలంతా సంతోషంగా జరుపుకోవాలని, ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. పాడి పంటలతో రైతులంతా సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటి సారిగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను ఇప్పటికే కొన్నింటిని అమలు చేయడానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు.

ఎస్పీ శుభాకాంక్షలు

సూర్యాపేట క్రైం: సంక్రాంతిని పురస్కరించుకుని జిల్లా పోలీసు శాఖ తరఫున ఎస్పీ రాహుల్ హెగ్డే ఆదివారం ఒక ప్రకటనలో ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా.. జూదం, మట్కా, కోళ్ల పందాలు నిర్వహించకుండా, కేవలం ముగ్గులు, క్రీడా పోటీలు నిర్వహిస్తూ వేడుకలను ఆనందంగా జరుపుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర సమయంలో డయల్ 100కు ఫోన్ చేసి పోలీసు సేవలు వినియోగించుకోవాలని కోరారు.

అనాజిపురంలో తెప్ప పోటీలు



తెప్ప పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు

పెన్‌పహాడ్: సంక్రాంతి సందర్భంగా అనాజిపురం గ్రామంలోని గాండ్లచెరువులో ఆదివారం నిర్వహించిన తెప్ప పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో కాశబోయిన పోశాలు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కాశబోయిన కృష్ణ ఏర్పాటు చేసిన ఈ పోటీలను మత్స్య సహకార సంఘం నాయకుడు దాసరి పెద్దమట్టయ్య ప్రారంభించారు. ఎన్నడూలేని విధంగా గ్రామ చెరువులో తెప్ప పోటీలు నిర్వహించడంతో గ్రామస్తులు ఎంతో ఆసక్తిగా తిలకించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాసరి చిన్న మట్టయ్య, నూకల సైదులు, కల్మెల సైదులు, శంకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

నారసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున ఆలయాన్ని తెరిచిన ఆచార్యులు శ్రీస్వామి, అమ్మవారికి సుప్రభాత సేవ, ఆరాధన, అర్చన, నిజాభిషేకం, అర్చన తదితర పూజలు గావించారు. అనంతరం ఆలయ ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు.

కమనీయం.. కల్యాణం



ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి-రంగనాయకుల స్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణ మహోత్సవాన్ని తిలకిస్తున్న భక్తజనం

ఊరూరా సంబరం

- అంబరాన్నంటిన భోగి వేడుకలు
- భోగి మంటలు, హరిదాసు కీర్తనలతో సందడిగా పల్లెలు, పట్టణాలు
- రంగురంగుల ముగ్గులతో మెరిసిన లోగిళ్లు
- పిల్లలకు భోగిపళ్లు పోసి ఆశీర్వదించిన పెద్దలు
- నేడు మకర సంక్రాంతి వేడుకలు

సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటుతున్నాయి. ఆదివారం భోగి వేడుకలు ఊరూరా వైభవంగా సాగాయి. భోగ భాగ్యాలు కలగాలని ఆకాంక్షిస్తు పల్లెలు, పట్టణాల్లో ప్రజలు భోగి మంటలు వేశారు. చిన్నారులపై భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసు కీర్తనలతో ఊర్లన్నీ సందడిగా మారాయి. మగువలు వేసిన రంగు రంగుల ముగ్గులతో ఇళ్ల లోగిళ్లు మెరిసిపోయాయి.

సూర్యాపేట : ఊరూరా సంక్రాంతి కళ వచ్చింది. పండుగ సందర్భంగా ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు, గంగిరెద్దుల విన్యాసాలు, హరిదాసుల కీర్తనలు, చిన్నారుల పతంగుల ఎగురవేత, యువత ఆటల పోటీలతో గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. బంధువులు, ఆడపడుచుల రాకతో ఇళ్లన్నీ కళకళలాడాయి. రైతులు పండించిన పంటలు చేతికొచ్చిన వేళ ఈ పండుగను మూడు రోజుల పాటు ఉత్సాహంగా జరుపుకుంటున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుంచే పల్లే పట్నం అనే తేడా లేకుండా ప్రజలంతా భోగి మంటలతో వేడుకలు ప్రారంభించారు. సాయంత్ర వేళ లో చిన్నారులకు భోగి పళ్ల పోసి ఆశీర్వదించారు. ధనుర్మాస ఉత్సవాల ముగింపు సందర్భంగా గోదా సమేత శ్రీనివాసుడి కల్యాణోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.



సూర్యాపేటలోని 46వ వార్డులో భోగి మంటల చుట్టూ ఆడిపాడుతున్న మహిళలు, యువతులు



నల్లగొండలో చిన్నారులకు భోగి పళ్లు పోస్తున్న మహిళలు

నేడు సంక్రాంతి

మూడు రోజుల సంక్రాంతి సంబరాల్లో భాగంగా రెండోరోజు సోమవారం మకర సంక్రాంతిని ప్రజలు జరుపుకుంటారు. పొంగలి, పిండి వంటలు వండి పితృదేవతలకు తర్పణాలు వదులుతారు. ఇళ్ల ముందు డూడూ బసవన్నలు విన్యాసాలు చేస్తూ దీవెనలు అందిస్తాయి.

సంక్రాంతి సంప్రదాయం

- హోమంతాలపల్లిలో నేడు ఫలహారపు బండ్ల ఊరేగింపు

చింతపల్లి : మండలంలోని హోమంతాలపల్లిలో 300 ఏళ్ల నాటి పేర్వాండ్ల స్వామి దేవాలయంతో ముడిపడిన ఆచారాన్ని గ్రామస్తులు ఇప్పటికీ కొనసాగిస్తున్నారు. సంక్రాంతి అనగానే గాలి పటాలు.. పిండి వంటలు.. హరిదాసుల కీర్తనలు.. కోడి పందాలతో పాటు ఇక్కడ ఈ పర్వదినాన్ని వినూత్నంగా జరుపుకుంటుంటారు. ఏటా సంక్రాంతి రోజున గ్రామంలో ఫలహారపు బండ్ల ఊరేగింపు ఆనవాయితీని ఈ గ్రామస్తులు 122 ఏళ్లుగా కొనసాగిస్తున్నారు.

ఊరేగింపు ఇలా..

సంక్రాంతి సందర్భంగా జరుపుకునే ఫలహారపు బండ్ల ఊరేగింపు సందర్భంగా గ్రామస్తులు ఉపవాస దీక్ష ఉంటారు. ఎడ్ల బండిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. సంక్రాంతి తర్వాత యాసంగి సీజన్ మొదలవుతుంది కాబట్టి కాడెద్దులకు పూజలు చేస్తారు. వందల సంఖ్యలో ప్రత్యేకంగా అలంకరించిన ఎడ్ల బండిలో స్వామివారి పూజా సామగ్రి, బొంగులు, బియ్యం పెట్టుకొని డప్పు చప్పుళ్లతో గోవింద నామస్మరణ చేస్తూ దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తారు. వేగంగా సాగే ఈ ఊరేగింపులో ఇప్పటి వరకు ఎలాంటి అపశృతి చోటు చేసుకోకపోవడం గమనార్హం. ఇలా దేవాలయం చుట్టూ ఎడ్లబండ్లను తిప్పడం వల్ల తమకు మంచి జరుగుతుందని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఈ ఊరేగింపును తిలకించేందుకు హైదరాబాద్‌తో పాటు దేవరకొండ, మాడ్గుల, మర్రిగూడెం, నాంపల్లి, చారగొండ, కల్వకుర్తి తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారు. సోమవారం జరిగే ఫలహారపు బండ్ల ఊరేగింపు కార్యక్రమానికి ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి.

నైవేద్యంగా.. బోనాలు

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంతో పాటు ఆవాస గ్రామాల్లో ఆదివారం భోగి బోనాలను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి పెద్దమ్మ తల్లి, కంఠమహేశ్వర స్వామికి నైవేద్యంగా సమర్పించారు. గౌడ కులస్తులు బోనాలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తీసుకెళ్లి కంఠమహేశ్వరస్వామి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఇందిరానగర్ కాలనీ సమీపంలో, జామచెట్లబావి వద్ద ఉన్న కంఠమహేశ్వర స్వామి, మోత్కూరు బిక్కేరు చెంతన ఉన్న స్వామి వారి ఆలయాలకు తీసుకెళ్లి తీపి బోనాలు సమర్పించారు. ముదిరాజ్ కులస్తులు మోత్కూరు పట్టణంలో ప్రదర్శన నిర్వహించి కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న పెద్దమ్మ తల్లి ఆలయం వద్ద ప్రదక్షిణచేసి బోనాల నైవేద్యం సమర్పించారు. జామచెట్లబావిలోని యాదవ కులస్తులు రామునిబండ వద్ద ఉన్న లింగమంతుల స్వామికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బీసు అనిల్, బుర్ర ఉప్పలయ్య, బీసు సత్తయ్య, కారుపోతుల వెంకన్న,



కంఠమహేశ్వర ఆలయంలో బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న గౌడ కులస్తులు

మొరిగాల రాజయ్య, మొరిగాల సురేష్, బుర్ర యాదయ్య, మొరిగాల సోమయ్య, సూదగాని యాదయ్య, బుషిగంపల సోమయ్య, బుషిగంపల యాకు, బందారపు యాదగిరి, చిలుకూరి యాదగిరి, దబ్బెటి సోంబాబు, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు మన్నె భీమయ్య, కార్యదర్శి కోమటి మత్స్యగిరి, ఆలయ కమిటీ అధ్యక్షులు ఆరె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మన్నె వెంకటేష్, డైరెక్టర్లు నల్ల నాగయ్య, సభ్యులు కోమటి జనార్దన్, పోతరబోయిన నర్సయ్య, సత్యనారాయణ, పంగ సతీష్, పంగ సుంకయ్య తదితరులు పాల్గొన్నారు.



బోనాలు తీసుకెళ్తున్న ముదిరాజ్ కులస్తులు



భువనగిరిలో కైట్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న జిట్టా బాలకృష్ణారెడ్డి



సూర్యాపేటలో గంగిరెద్దుకు తవుడు తినిపిస్తున్న ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

లోక్‌సభ ఎన్నికల్లో 14 సీట్లు గెలుస్తాం



మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



పూజల్లో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

మేళ్లచెరువు: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ 13నుంచి 14సీట్లు గెలుస్తదని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం మేళ్లచెరువు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. లోక్‌సభకు మార్చిలో ఎన్నికలు జరగవచ్చని చెప్పారు. త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలోనే బీజేపీ నాయకులు అయోధ్యలో రామమందిరం నిర్మాణం పూర్తికాకుండానే ప్రారంభించాలనుకుంటున్నారని విమర్శించారు. దేవాలయం పూర్తయితే తాను వెళ్లి దర్శనం చేసుకుంటానన్నారు. రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు రాష్ట్రాన్ని కొల్లగొట్టారన్నారు. ఆరు లక్షల డెబ్బయి ఐదు కోట్ల రూపాయల అప్పుచేసి ప్రజలను మోసం చేశారన్నారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో లిఫ్టుల మరమ్మతులు చేయిస్తానని పేర్కొన్నారు. చెరువులు అక్రమణకు గురికాకుండా సర్వే నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా మేళ్లచెరువు గ్రామ పంచాయతీలో రూ.రెండు కోట్లు, మఠంపల్లి పంచాయతీలో 75 లక్షల రూపాయలు బీఆర్ఎస్ హయాంలో దోపిడీ చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అవినీతికి, అధికారం దుర్వినియోగానికి పాల్పడొద్దని కోరారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ పార్క్ పెట్టించి నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తానన్నారు.

శివాలయంలో మంత్రి ఉత్తమ్ పూజలు

మేళ్లచెరువులోని శ్రీఇష్టకామేశ్వరీ సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాయలంలో రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అభిషేకాలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం పూలమాల, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భాస్కరరెడ్డి, కొట్టె సైదేశ్వరరావు, శాగంరెడ్డి గోవిందరెడ్డి, పోచం వీరారెడ్డి, వెంకటరెడ్డి, బాలరాజు, మోహన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎంపీ టికెట్‌కు డిమాండ్

- నల్లగొండ, భువనగిరి స్థానాల నుంచి పోటీకి పలువురి ఆసక్తి
- ఈ రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నుంచి ఆశావహులు అధికం
- గులాబీ పార్టీలోనూ టికెట్ కోసం పలువురి ప్రయత్నాలు
- ఎక్కడి నుంచైనా పోటీకి తన కుమారుడు సిద్ధమన్న గుత్తా
- బీజేపీలో టికెట్ కోసం పట్టు పడుతున్న కొందరు నేతలు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ఉమ్మడి జిల్లాలో ప్రధాన పార్టీల నుంచి ఎంపీ టికెట్‌కు డిమాండ్ పెరుగుతోంది. ఆయా పార్టీల్లోని ఆశావహులు తమ గాడ్ ఫాదర్‌ల ఆశీస్సులు పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. వచ్చే నెలలో లోక్‌సభ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో ఆశావహుల సందడి మొదలైంది. ప్రధాన పార్టీలు తమ అభ్యర్థులు ఎవరనేది ఇంకా నిర్ణయించకపోయినా ఆశావహులు మాత్రం తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. దీంతో వారి జాబితా రోజురోజుకూ పెరుగుతోంది.

నల్లగొండలో ఎక్కువ మంది..

నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గంలో ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉంది. అధికార కాంగ్రెస్ పార్టీలో ఇప్పటికే తాను ఎంపీగా పోటీ చేస్తానని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి ప్రకటించారు. మరోవైపు ఆయన కుమారుడు రఘువీర్ రెడ్డికి టికెట్ ఇవ్వాలని పట్టుపడుతున్నారనే చర్చ పార్టీ వర్గాల్లో జోరుగా సాగుతోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల సమయంలో సూర్యాపేట టికెట్‌ను మాజీమంత్రి దామోదర్‌రెడ్డికి కేటాయించడంతో ఆ టికెట్‌ను ఆశించిన పటేల్ రమేష్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇస్తామని పార్టీ అధిష్టానం హామీ ఇచ్చింది. ప్రస్తుతం రఘువీర్‌రెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వాలని జానారెడ్డి పట్టుపడుతున్న నేపథ్యంలో పటేల్ రమేష్‌రెడ్డికి ఎమ్మెల్సీ ఇస్తారా? లేదా ఎంపీ టికెట్ ఇస్తారా? ఏం ఇస్తారన్నది ఆసక్తికరంగా మారింది. పటేల్ రమేష్‌రెడ్డికి ఏదో ఒకటి మాత్రం కచ్చితంగా ఇస్తారనే చర్చ సాగుతోంది. బీఆర్ఎస్‌లోనూ పలువురు ఆశావహులు ఎంపీ టికెట్‌కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి అసెంబ్లీ ఎన్నికల్లో మునుగోడు టికెట్ ఆశించారు. అయినా అధిష్టానం ఇవ్వలేదు. తన కుమారుడికి నల్లగొండ ఎంపీ టికెట్ కావాలని ఇప్పటికే అధిష్టానం దృష్టికి తీసుకెళ్లిన గుత్తా సుఖేందర్‌రెడ్డి శుక్రవారం నల్లగొండ లేదా భువనగిరిలో ఎక్కడ టికెట్ ఇచ్చినా పోటీ చేస్తామని ప్రకటించారు. మరోవైపు అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన శానంపూడి సైదిరెడ్డి కూడా టికెట్ ఆశిస్తున్నట్లు చర్చ సాగుతోంది. వారే కాకుండా ఓ వ్యాపారవేత్తతోపాటు మరికొందరు కూడా నల్లగొండ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది.

భువనగిరి నుంచి పోటీకి పలువురి ఆసక్తి

భువనగిరి పార్లమెంట్‌లో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీలోనే ఎక్కువగా పోటీ ఉంది. ఏడెనిమిది మంది అక్కడి నుంచి టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. భువనగిరి ఎంపీగా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సతీమణి లక్ష్మి పోటీ చేస్తారని గతంలో చర్చ జరగ్గా.. ఇటీవల కోమటిరెడ్డి సూర్యపవన్‌రెడ్డి పేరు తెరపైకి వచ్చింది. మరోవైపు సీఎం రేవంత్‌రెడ్డికి అనుచరుడిగా ఉన్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎంపీ టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తన కూతురు కీర్తిరెడ్డి కోసం టికెట్ అడుగుతుండగా, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, బూడిద భిక్షమయ్యగౌడ్, గొంగిడి మహేందర్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నట్లు తెలిసింది. శుక్రవారం తెలంగాణ భవన్‌లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎవరిని పోటీలో ఉంచాలన్న దానిపైనా చర్చ జరక్కపోయినా ఆశావహులు మాత్రం తమకు టికెట్ కావాలన్న విషయాన్ని అధిష్టానం వద్ద ప్రస్తావించినట్లు తెలిసింది. ఇక బీజేపీ నుంచి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యాం సుందర్‌రావు, డాక్టర్ బూర నర్సయ్యగౌడ్ తోపాటు మరో ఇద్దరు పోటీకి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.

బీజేపీ నుంచి పది మంది..

బీజేపీ నుంచి టికెట్ ఆశిస్తున్న వారి జాబితా కూడా పెద్దగానే ఉంది. పది మంది ఆశావహులు తమకు టికెట్ కావాలని అడుతుండడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల నల్లగొండలోని ఆ పార్టీ కార్యాలయంలో పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి చింతల రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో గార్ల పాటి జితేందర్, మన్నెం రంజిత్‌యాదవ్, నూకల నర్సింహారెడ్డి, బందారు ప్రసాద్, గోలి మధుసూదన్‌రెడ్డి, లాలూనాయక్, నాగం వర్షిత్ రెడ్డి, నివేదితారెడ్డి, సత్యనారాయణ, మన్మథరెడ్డి తమకు ఎంపీ టికెట్ కావాలని అడిగారు. బీజేపీ నుంచి కూడా అంతమంది టికెట్ అడుగుతుండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

ముగ్గు.. మురిపెం

సంక్రాంతి సందర్భంగా ఇళ్ల ముంగిట వేసిన అందమైన ముగ్గులతో సెల్ఫీలు పంపాలన్న 'సాక్షి' ఆహ్వానానికి విశేష స్పందన లభించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు మహిళలు, యువతులు, చిన్నారులు తాము వేసిన ముగ్గులతో సెల్ఫీలు దిగి పంపించారు.



బచ్చలకూర మనూష, నేలమర్రి


బూర్గుల భాగ్య, తిమ్మాపురం


మిట్టకోల లాస్య, అర్వపల్లి


నల్లగుంట్ల అన్నపూర్ణ - సాయికీర్తన అర్వపల్లి


పారిజాత, అర్వపల్లి


రేఖా బోయపల్లి, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి


తుమ్మ మానస, వెలుగుపల్లి

వైభవంగా.. గోదాదేవి కల్యాణం

- యాదాద్రిలో కనుల పండువగా వేడుక


ఆలయ ముఖ మండపంలో కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న ఆచార్యులు


స్వామివారి అలంకార సేవలను మాఢ వీధిలో ఊరేగిస్తున్న ఆచార్యులు

యాదగిరిగుట్ట: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఆదివారం రాత్రి గోదాదేవి – శ్రీరంగనాథుల కల్యాణోత్సవాన్ని ఆచార్యులు పాంచరాత్ర ఆగమశాస్త్రానుసారంగా నిర్వహించారు. తొలుత స్వామిఅమ్మవార్లను విశేషంగా అలంకరించి ఆలయ తిరు, మాఢ వీధిలో సంప్రదాయంగా ఆలయ ఈఓ, అనువంశిక ధర్మకర్త, ఆచార్యులు, అధికారులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలతో ముందు నడిచారు. భక్తుల మధ్య ఊరేగించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో గోదాదేవి – శ్రీరంగనాథులను అధిష్టించి కల్యాణ తంతు ప్రారంభించారు. పంచనారసింహుల సమక్షంలో జరుగుతున్న ఈ కల్యాణ వేడుకలో మొదటగా స్వస్తీవాచనం, పుణ్యాహవచనం, రక్షాబంధనం వంటి సంప్రదాయ ఉత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం జీలకర్ర బెల్లం వంటి కార్యక్రమాన్ని ఆచార్యులు శాస్త్రోక్తంగా జరిపించారు. గోదాదేవి అమ్మవారు శ్రీరంగనాథుడిని పరిణయం ఆడే మాంగళ్యధారణ తంతును ఆచార్యులు ఆగమశాస్త్ర ప్రకారం వేద మంత్రాలతో నిర్వహించారు. వేడుకల్లో ఆలయ ఈఓ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి దంపతులు, ఆలయ ప్రధానార్చకులు, అర్చకులు, వేద పండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా, సోమవారం సంక్రాంతి పర్వదినాన అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించే కార్యక్రమాన్ని ప్రధానాలయంలో అర్చకులు నిర్వహించనున్నారు.

పాటిమట్లలో ఆరు గ్యారంటీ పథకాలపై..

మోత్కూరు : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలంలోని పాటిమట్ల గ్రామంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలకు సంబంధించిన ముగ్గును ఆదివారం భోగి పండుగ సందర్భంగా కుర్మేటి లక్ష్మి తమ ఇంటి ముందు వేసింది. రైతు భరోసా, మహాలక్ష్మి, గృహ జ్యోతి, యువ వికాసం, ఇందిరమ్మ ఇళ్లు, చేయూతలాంటి ఆరు పథకాలను సూచిస్తూ వేసిన ఈ ముగ్గు స్థానికులను ఎంతో ఆకట్టుకుంది.



పాటిమట్లలో వేసిన ఆరు గ్యారంటీ పథకాల ముగ్గు

యాదాద్రీశుడి సన్నిధిలో ప్రముఖుల పూజలు


తెలంగాణ డీజీపీ రవిగుప్తా దంపతులు, ఏపీ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవిచౌదరి దంపతులకు వేద ఆశీర్వచనం చేస్తున్న ప్రధానాచార్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని తెలంగాణ రాష్ట్ర డీజీపీ రవి గుప్తా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదివారం సందర్శించారు. వీరికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద ప్రత్యేక అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న ఆయనకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా.. ఈఓ రామకృష్ణారావు, ఆలయాధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

వందరోజుల్లో అన్ని పథకాలు అమలు

- రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ప్రజాపాలన దరఖాస్తులు పరిశీలించి వంద రోజుల్లో అన్ని పథకాలు అమలు చేస్తామని రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండలో మంత్రి తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పేదింటి ఆడబిడ్డలు ఉచిత బస్ ప్రయాణం ద్వారా సొంత గ్రామాలకు వెళ్లారని తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో 30 లక్షల మంది మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్లు, సిలిండర్లపై సబ్సిడీకి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ సభల్లోనే లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తున్నామన్నారు. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో రూ.10 కోట్లతో హాస్టల్ నిర్మాణం, రూ.100 కోట్లతో నల్లగొండ – ముశంపల్లి – కన్నెకల్ మీదుగా తిప్పర్తి రోడ్డు, రూ.30 కోట్లతో గుండ్లపల్లి నుంచి రేగట్ట వరకు డబుల్ రోడ్డు, రూ.34 కోట్లతో ధర్వేశిపురం వయా దోరేపల్లి నుంచి పగిడిమర్రి వరకు రోడ్డు పనులకు త్వరలో శంకుస్థాపన చేస్తామని తెలిపారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టులో అక్రమాలపై విచారణ చేపడుతున్నామన్నారు. నల్లగొండలో డ్రెయినేజీ, మిగిలిపోయిన రోడ్లు పూర్తి చేస్తామన్నారు. నల్లగొండ మున్సిపాలిటీలో విలీనం చేసిన చర్లపల్లి, మర్రిగూడెం, ఆర్జాలబావిలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి మున్సిపల్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, వంగూరి లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆడపిల్ల గొప్పతనం వివరించేలా..

గుండాల : యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ మహేశ్వరి ఆడపిల్ల గొప్పతనాన్ని వివరిస్తూ వేసిన ముగ్గురు ఆకట్టుకుంది. భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని వేసిన ముగ్గును చేసిన గ్రామస్తులు ఆమెను అభినందించి ప్రశంసించారు.


బ్రాహ్మణపల్లిలో అంగన్‌వాడీ టీచర్ వేసిన ముగ్గు